ఇరిగేషన్ స్థలాల్లో ఆక్రమణలు



బడికి వేళాయె..



AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## ముల్లంగి(ఐ)లో పోచమ్మ పండుగ



**అక్షరటుడే, ఇందూరు:** ముల్లంగి (ఐ) గ్రామంలో ఆదివారం పోచమ్మ పండుగ, బోనాలు పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూదం శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొల్లారం అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోలం నితిన్, క్యాషియర్ గుండ్ల శేఖర్, యువకులు నవీన్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..: మానాల మోహన్ రెడ్డి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రుద్రంగి మండలంలో ఆదివారం ఉమ్మడి మానాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ అధ్యక్షుడు జువడి నర్సింగ్ రావుతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, సన్న వడ్ల బోనస్, రైతుబంధు, రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్ అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తోందన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందిగా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జలపతి, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ గంగ నర్సయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి, లక్ష్మణ్ నాయక్, భీమ్‌గల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జేజే నర్సయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నారాయణ, వివిధ గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# బడి బస్సులు భద్రమేనా!

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పున : ప్రారంభం కానున్నాయి. చాలా మంది ప్రైవేట్ పాఠశాలలకు తమ విద్యార్థులను బస్సుల్లో పంపుతారు. కొందరు ఆటోలు, వ్యాన్‌లను ఆశ్రయిస్తారు. అయితే చాలా వరకు విద్యార్థులను తీసుకు వెళ్లే బస్సులు, వ్యాన్‌లు ఫిట్‌నెస్ లేకపోవ డంతో ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. విద్యార్థుల భద్రతపై రవాణా శాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని, రూల్స్ పాటించని స్కూల్ బస్సులు, వ్యాన్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

*- అక్షరటుడే, ఎల్లారెడ్డి*

■ ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఆర్టీఏ ఫోకస్ ■ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్న అధికారులు ■ ఫిట్‌నెస్ లేకపోతే కఠిన చర్యలు

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల బస్సులను ఆర్టీఏ, పోలీస్ అధికారులు కలిసి తనిఖీ చేస్తున్నారు. ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు, డ్రైవర్ లైసెన్స్, బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్విప్‌మెంట్, ఎమర్జెన్సీ డోర్ సరిగా ఉన్నాయా అని పరిశీలించనున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలల బస్సులను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. గతంలో పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులు ప్రమాదాల బారిన పడటంతో ఈ ఏడాది ముందస్తు చర్యలు చేపట్టారు. రేపటి నుంచి తనిఖీలు చేపట్టనున్నారు.

### ఇవి తప్పనిసరి

వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలి. బస్సు సామర్థ్యం మేరకే విద్యార్థులను ఎక్కించుకోవాలి. డ్రైవర్‌కు లైసెన్స్, 5 ఏళ్ల అనుభవం ఉండాలి. స్పీడ్ గవర్నర్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు బస్సులో అమలు చేయాలి. వాహనం లైట్లు, ఎమర్జెన్సీ డోర్, విండో సక్రమంగా ఉండాలి. ఏవైనా మరమ్మతులు ఉంటే ఇప్పుడే చేయించాలి. ప్రతి బస్సుకు ఒక అటెండర్‌ను నియమించాలి.

### తల్లిదండ్రులు జాగ్రత్త

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపే తల్లిదండ్రులు సైతం అప్రమత్తంగా ఉండాలి. స్కూల్ బస్సు కండిషన్ ఎలా ఉంది? డ్రైవర్‌కు తాగి వచ్చే అలవాటు ఉందా? సీట్ల కంటే ఎక్కువ మంది ఎక్కుతున్నారా? అని చెక్ చేసుకోవాలి. సమస్యలు ఉంటే.. రవాణా శాఖ టోల్ ఫ్రీ నంబర్ 18004258002కు ఫిర్యాదు చేయొచ్చు.

### తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాల్సిందే

నిజామాబాద్‌లో జిల్లాలో సుమారు 800 బస్సులు ఉండగా ఇప్పటివరకు 648 బస్సులు ఫిట్‌నెస్ టెస్ట్ పూర్తి చేసుకున్నాయి. కామారెడ్డిలో 277 బస్సులు ఉండగా 190 బస్సులు టెస్ట్‌లు పూర్తయ్యాయి. మిగతా బస్సులకు కూడా పరీక్షలు పూర్తి చేస్తాం. నిబంధనల ప్రకారమే స్కూల్ బస్సులు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. తాజాగా జిల్లాలో మొబైల్ స్క్వాడ్ ఏర్పాటు చేశాం. ఎంవీఐ, ముగ్గురు ఏఎంవీఐలు, ఇద్దరు హోంగార్డులతో బృందం నిరంతరం తనిఖీలు చేస్తుంది. ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తూనే ఉంటాయి.

*– దుర్గా ప్రమీల, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్*

## సోషల్ మీడియాలో సదరం తేదీలపై ఫేక్ ప్రచారం..

### నమ్మొద్దని డీఆర్డీవో సూచన

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా డీఆర్డీవో పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సదరం క్యాంప్ తేదీలు పూర్తిగా అవాస్తవమని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా ఆస్పత్రిలో జూన్ 14, 15, 21, 22 తేదీల్లో సదరం క్యాంప్‌లు జరుగుతాయని వైరల్ అవుతున్న పోస్టర్ అధికారికమైనది కాదని డీఆర్డీవో స్పష్టం చేశారు. ఈ తప్పుడు సమాచారాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. సదరం క్యాంప్‌లకు సంబంధించిన అధికారిక సమాచారం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ మొబైల్ నంబరుకు మాత్రమే మెసేజ్ ద్వారా లేదా నేరుగా ఫోన్ కాల్ ద్వారా తెలియ చేస్తామని తెలిపారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని సృష్టించి ప్రచారం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## డీమార్ట్‌లో అగ్నిమాపక శాఖ తనిఖీలు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని డీమార్ట్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫైర్‌సేఫ్టీకి సంబంధించి పరికరాలు అమర్చిన తీరును పరిశీలించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ శంకర్ ఆధ్వర్యంలో మార్ట్‌లోని సిబ్బందికి అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు నిష్క్రమించే విధానం, అగ్నిప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



## కార్పొరేటర్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్.. తప్పిన ముప్పు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** బీజేపీ కార్పొరేటర్ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరంలోని 45 డివిజన్ కార్పొరేటర్ సుమిత్ర వేణుగోపాల్ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు లేచాయి. అయితే ఆ సమయంలో కార్పొరేటర్ సుమిత్ర ఇంట్లో లేరు. ఇంట్లోని పైఅంతస్తులో ఆమె భర్త వేణుగోపాల్ ఉండగా వెంటనే అగ్ని ప్రమాదాన్ని గమనించిన ఆయన ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు నాల్గో టౌన్ పోలీసులు సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం కార్పొరేటర్ ఇంటికి వెళ్లారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్నారు.

## వైరల్ అయిన ఆడియో క్లిప్ నకిలీది..: షబ్బీర్ అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ఎదుట ఆదివారం హాజరయ్యారు. ఇటీవల వైరల్‌గా మారిన ఆడియో క్లిప్‌లపై వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆడియో క్లిప్ వ్యవహారంపై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ శనివారం వివరణ ఇవ్వాలని షబ్బీర్ అలీకి షోకాజ్ ఇచ్చిన విషయం తెలిసిందే. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డబ్బులు తీసుకొని పదవులు అమ్ముకుంటున్నారని, మహిళలను కించపరిచేలా షబ్బీర్ అలీ మాట్లాడినట్లు ఓ ఆడియో లీక్ కావడంపై వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశించింది. దీనిపై స్పందించిన షబ్బీర్ అలీ ఆ ఆడియో క్లిప్ పూర్తిగా నకిలీదని, కల్పితమైనదని కొట్టిపారేశారు. క్రమశిక్షణ కమిటీ వివరణ కోరకముందే తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు, కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

## ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి: గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లోక్ భవన్‌లో ఉత్తమ సేవలకు గాను పలువురికి అవార్డులు అందజేశారు. దీంట్లో భాగంగా పోలీస్‌శాఖ తరపున అత్యధికంగా రక్తదానాలు చేయించడంలో కృషి చేసిన సీపీ సాయిచైతన్య తరపున ఏసీపీ ప్రకాశ్ అవార్డు స్వీకరించారు. అలాగే రక్తదానాలపై యువతకు అవగాహన కల్పించిన జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్ రెడ్డి తరపున జనరల్ సెక్రెటరీ, వర్ని తహశీల్దార్ ప్రశాంత్ అవార్డు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోక్ భవన్‌లోనూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అందులో 87 సార్లు రక్తదానం చేసిన తోట రాజశేఖర్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రత్యేకంగా అభినందించారు.



## కనువిందు చేస్తున్న కలువ పూల సోయగం..

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సీఎంసీ కళాశాల పక్కన ఉన్న కుంట నూతన శోభను సంతరించుకుంది. కొన్ని రోజులుగా కుంటలో కలువ పూలు వికసించి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెద్దపెద్ద తామరాకుల మధ్య వికసించిన కలువ పూలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. డిచ్‌పల్లి స్టేసన్, నడిపల్లి వైపు వెళ్లే వాహనదారులు ఆగి మరి ఈ పూల సోయగాన్ని తిలకిస్తున్నారు. ఈ చిత్రాన్ని 'అక్షరటుడే' క్లిక్ మనిపించింది.

*– అక్షరటుడే, డిచ్‌పల్లి*



## స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలి..: ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గాండ్ల పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐకమత్యానికి ప్రతీక గాండ్ల సంఘమని కొనియాడారు. విద్యతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా దొంగలించబడుతుంది కానీ.. విద్యను ఎవరు దొంగిలించే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని చెప్పిందన్నారు. అయితే స్థల ప్రభావంతో ఇందూరులో ఇబ్బందులు ఎదురయ్యాయని, దీంతో తాను సీఎం దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ధన్‌పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా వంద మంది పేద విద్యార్థులకు విద్యను అందజేస్తున్నామన్నారు. అలాగే గాండ్ల సంఘం పేద విద్యార్థులకు కూడా తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి రమేష్, కార్పొరేటర్లు ప్రసన్న సత్యపాల్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ఎర్రం సుధీర్, మనోహర్, బీజేపీ నాయకులు గిరిబాబు, నూనె వేణు, గాండ్ల పట్టణ సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మోహన్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చు



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆరోగ్యవంతులంతా రక్తదానం చేయవచ్చని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అచ్చుకట్ల జీవన్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ బ్లడ్ బ్యాంక్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఐడీఏ జిల్లా అధ్యక్షుడు అచ్చుకట్ల జీవన్‌తో పాటు సుమారు 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ.. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు సీను నాయక్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రఘు, నాయకులు కాసుల రోహిత్, అందె రమేష్, సాకేత్, విష్ణు, దంత వైద్యులు సందీప్, సాయికృష్ణ పాల్గొన్నారు.

## రూరల్ సీఐ కార్యాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బాన్సువాడ రూరల్ సీఐ కార్యాలయ భవన నిర్మాణ పనులను మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, బాన్సువాడ టౌన్ సీఐ శ్రీధర్‌తో కలిసి భవనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. కార్యాలయ భవనం పూర్తయితే పోలీసు శాఖ సేవలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నార్ల సురేష్, ఎజాజ్, గురు వినయ్, మోహన్ నాయక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ కాలనీ హనుమాన్ ఆలయంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని టీచర్స్ కాలనీ దాసాంజనేయ ఆలయం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, న్యాయవాది చిల్క కిష్టయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొంతం మురళి, ఉపాధ్యక్షుడు ధనుంజయ్ రెడ్డి, కోశాధికారి సురేందర్ రెడ్డి, కార్యదర్శి రామాగౌడ్, విశ్రాంత ఉపాధ్యాయులు రాంరెడ్డి, రమేష్, కాలనీవాసులు కృష్ణారెడ్డి, కిట్టు, బండి రాజు, సాగర్, దశరథం, గంగాధర్, విజయ్, ఆనంద్, సతీష్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ స్థలాల్లో ఆక్రమణలు..

**గాంధారి మండలంలో విలువైన ఇరిగేషన్ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జా చేసేందుకు సిద్ధమవుతున్న అక్రమార్కులు కొన్నేళ్లుగా నీటిపారుదల శాఖ భూములను లక్ష్యంగా చేసుకున్నారు. సంబంధిత శాఖ సైతం ఈ ఆక్రమణపై స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.**

**– అక్షరటుడే గాంధారి**



- చోద్యం చూస్తున్న శాఖ అధికారులు..
- ఆక్రమణలు ఆగకపోతే భవిష్యత్తులో కష్టమే..
- అక్రమార్కుల వ్యవహారంపై ప్రజల్లో ఆందోళన

గాంధారి మండలంలో 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. మండలంలో దాదాపు 104 చెరువులు ఉండగా వాటిలో దాదాపు సగానికి పైగా కబ్జాలకు గురయ్యాయి. స్థానికంగా ఉన్న బడా నాయకులు, భూకబ్జాదారులు వాటిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. అలా కబ్జా చేసిన వాటిని మొరంతో లెవల్ చేయించి అనంతరం అమాయకులకు అంటగడుతున్నారు. కుంటలు, కాలువలు ఇలా ప్రభుత్వ సంబంధిత స్థలాలపై కన్నేశారు.


### రాబోయే తరాలకు కష్టమే..

చెరువులు, కుంటలు, కాల్వల ఆక్రమణ జరుగుతున్నా స్థానికంగా అధికారులు గాని.. ఇరిగేషన్ శాఖ సిబ్బంది కాని పట్టించుకోవట్లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా చెరువులను కబ్జా చేస్తూ పోతే భవిష్యత్తు తరాలను నీటివనరులు కనుమరుగవుతాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కబ్జాల కారణంగా నీటినిలువ సామర్థ్యాలు తగ్గిపోయి తాగు,సాగునీటికి ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని.. ఇలా తటాకాలను, సంబంధిత భూములను కబ్జా చేస్తూ పోతే.. భవిష్యత్తు మరింత భయానకంగా తయారువుతుందని వారంటున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

గాంధారి మండల కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఆక్రమణలు జరుగుతున్నాయనిది వాస్తవమే. మేం కూడా ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందజేస్తున్నాం. కబ్జాకు గురైనట్లుగా ఆరోపణలు వస్తున్న ప్రాంతాల్లో సర్వేల చేయిస్తాం. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన భూములను కాపాడే ప్రయత్నం తప్పనిసరిగా చేస్తాం.

– వంశీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ







## బడికి వేళాయె..

**ఇన్నాళ్లు ఆటపాటలతో సందడి చేసిన చిన్నారులు సోమవారం నుంచి స్కూల్ బాట పట్టనున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సూళ్లు ముస్తాబవుతున్నాయి. నగరంలోని శంకర్ భవన్‌లో తరగతి గదులను, ఆవరణను అక్కడి సిబ్బంది శుభ్రం చేశారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.** – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## 16న ఆర్మూర్‌లో జగన్నాథ రథయాత్ర



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 16న జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జగన్నాథ రథయాత్రకు హాజరుకావాలని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘుకు ఆదివారం ఇస్కాన్ ప్రతినిధులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

## జర్నలిజంలో విశిష్ట సేవలు.. స్వామికి గౌరవ డాక్టరేట్



**అక్షరటుడే, కామారెడ్డి:** రాజంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, సామాజిక సేవకుడు డాక్టర్ చెట్టబోయిన స్వామి ముదిరాజ్‌కు అరుదైన గౌరవం దక్కింది. జర్నలిజం రంగంలో విశిష్ట సేవలు, సామాజిక కార్యక్రమాల్లో విశేష కృషికి గాను ఆయన డాక్టరేట్ అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో స్వామికి గౌరవ డాక్టరేట్‌తో పాటు జాతీయ పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఫరీదాబాద్‌లో ఘనంగా నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవానికి శనివారం పలు రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు హాజరయ్యారు. పలు ప్రముఖ దినపత్రికల్లో విలేకరిగా పనిచేసిన స్వామి ముదిరాజ్ ప్రస్తుతం సొంత పత్రికను నిర్వహిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నారు. బీసీ సంఘం కామారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా యువత అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, పేదలకు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు.

## గడ్డి మందు సేవించి యువకుడు మృతి

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం సందీప్ (19) గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన చోటు చేస్తుంది. సీఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్ శుక్రవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి సందీప్ మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సందీప్ గడ్డి మందు సేవించడానికి గల కారణాలపై విచారణ కొనసాగుతున్నట్లు సీఐ తెలిపారు.

# ముచ్చటగా 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం చేపూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల కలుసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు చేపూర్‌లోని గురడి రెడ్డి కళ్యాణమండపం వేదికగా నిలిచింది. మండపంలోని చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 35ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 40 మంది వరకు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను, క్లాస్‌రూమ్‌లో అల్లర్లను, గురువులు బోధించిన విద్యావిధానాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా ఇన్నేళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మాజీ గెజిటెడ్ హెచ్ఎం బుచ్చయ్య, అంజయ్య, రఘోత్తం రెడ్డితో పాటు ముగ్గురు గంగాధర్‌లు.. ఇలా మొత్తం 16 మంది గురువులు కార్యక్రమానికి విచ్చేశారు. వారికి పూర్వ విద్యార్థులు గురుదక్షిణగా దుస్తులు అందించి, పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా.. ఆత్మీయ సమ్మేళనంలో ఒక వినూత్న సాంప్రదాయానికి తెరలేపారు. తోటి విద్యార్థినులను తమ సొంత ఆడపడుచులుగా భావించి, ఆ బ్యాచ్‌లోని మహిళలకు, వారి భర్తలకు పూర్వ విద్యార్థులు నూతన వస్త్రాలను బహూకరించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులైన టీఎన్జీవో జిల్లా మాజీ అధ్యక్షుడు, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మీనుగు రాజేశ్వర్, ఉపాధ్యాయుడు తోపారం కిషన్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ లైన్‌మెన్ గంజి చంద్రశేఖర్, రైల్వే డిపార్ట్మెంట్ హెల్త్ అసిస్టెంట్ (పూణె) శ్రీనివాస్ శంకర్, శ్రీనివాస్, గంగాధర్, నర్సయ్య రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అందించేందుకు ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి అన్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని మెల్లకుంట తండా వద్ద తాండూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. మండలంలో జొన్నల కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. క్వింటాలు జొన్నలకు రూ.3,699 మద్దతు ధరను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. జొన్నలు పండించిన రైతులంతా కేంద్రాల వద్దకు వచ్చి విక్రయించి మద్దతు ధర పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ వెంకట మిస్త్రి, తాండూర్ సొసైటీ వైస్ ఛైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, తాండూర్ సొసైటీ వైస్ ఛైర్మన్ బాబురావు, సర్పంచ్ బాల్యా నాయక్, సొసైటీ కార్యదర్శి మురళి, సొసైటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.